# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 13 సంచిక:259 | వరంగల్, 25-3-2026, బుధవారం | పేజీలు: 8 | వెల: 1.00


## ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా

తుంగతుర్తి నియోజకవర్గంలోని ప్రతి బిఆర్ఎస్ కార్యకర్తను కాపాడుకుంటామని, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు.

## ప్రస్తుతం సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయి - మోదీ



పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అక్కడ యుద్ధం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని.. ఇది ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఇంధన సంక్షోభానికి దారితీసిందన్నారు. భారత్‌కు కూడా ఆందోళనకరంగా మారిందన్నారు. దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులపై రాజ్యసభలో మాట్లాడిన ఆయన.. భారత్‌కు హర్మూజ్ జలసంధి నుంచి కూడా చమురు నౌకలు వస్తాయని, అవి సురక్షితంగా మన పోర్టులకు చేరేలా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

"భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నాం. అక్కడ చిక్కుకున్న మన వారిని సురక్షితంగా తీసుకొచ్చాం. ఇప్పటివరకు 3.75లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. దాడుల్లో కొంతమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. గల్ఫ్ దేశాలతో నిరంతరం చర్చలు జరుపుతున్నాం. అన్ని సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కార మార్గం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## 'కోవిడ్' నాటి విషాదాలను మోదీ మర్చిపోయారా?: రాహుల్ గాంధీ



పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ పార్లమెంట్ ఉభయసభల్లో ప్రసంగించారు. ఈ సందర్భంగా 'కొవిడ్' ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందిస్తూ ప్రధానిపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా మహమ్మారి విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి మర్చిపోయారా? అని ప్రశ్నించారు.

పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ.. ప్రధాని ప్రసంగంపై స్పందించారు. "మన విదేశాంగ విధానాలను మోదీ తన వ్యక్తిగత విధానాలుగా మార్చారు. మోదీ రాజీ పడితే.. మన విదేశాంగ విధానం కూడా రాజీ పడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో(ఎతీబఎజూ) మోదీ రాజీకొచ్చినట్లే కన్పిస్తోంది" అని ఆరోపించారు.

## కశ్మీరీ వేర్పాటువాది ఆసియా అంద్రాబీకి జీవితఖైదు

కశ్మీరీ వేర్పాటువాది, నిషేధిత ఉగ్రవముఠా నాయకురాలు ఆసియా అంద్రాబీకి జీవిత ఖైదు పడింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం కింద నమోదైన కేసులో రెండు నెలల క్రితం ఆమెను దోషిగా నిర్ధరించిన దిల్లీ ప్రత్యేక న్యాయస్థానం.. తాజాగా శిక్ష ఖరారు చేసింది.



ఆమె సహచరులు సోఫీ ఫహ్మీదా, నహీదా నస్రీన్‌లకు 30 ఏళ్ల చొప్పున శిక్ష విధిస్తూ దిల్లీ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

ఉగ్ర కార్యకలాపాలకు కుట్ర పన్నారనే ఆరోపణలపై ఆసియా అంద్రాబీ సహా ముగ్గురు కశ్మీరీ వేర్పాటువాదులు 2018 ఏప్రిల్‌లో అరెస్టయ్యారు. యూఏపీఏ కింద అభియోగాలు నమోదు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు నిందితులు, వీరు నిర్వహిస్తున్న సంస్థపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ.. ఇటీవల దర్యాప్తు పూర్తిచేసింది. ఈ ఏడాది జనవరిలో వీరిని దోషులుగా తేల్చిన దిల్లీ అడిషనల్ సెషన్స్ కోర్టు తాజాగా శిక్ష ఖరారు చేసింది.

## స్వపక్షంతోనే పోరాటం చేయలేను: జీవన్‌రెడ్డి

పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించేందుకు ఆయనతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్ మంగళవారం భేటీ అయ్యారు. సమావేశం అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో విపక్షంతో పోరాటం చేయాలని, తాను పార్టీలో ఉంటే స్వపక్షంతోనే పోరాడాల్సి వస్తోందని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ సమస్యకు పార్టీ అధిష్ఠానం వద్ద, తన వద్ద కూడా పరిష్కారం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే తాను పార్టీని వీడాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. దీనిపై బుధవారం ఉదయం స్పష్టమైన ప్రకటన చేయనున్నట్లు జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఈ వార్త చదివారా: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటుకు సన్నాహాలు

## ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ మంత్రి కోమటిరెడ్డి స్పష్టత



హైదరాబాద్: ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లైఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

## ప్రజల దృష్టి మరల్చేందుకే.. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఛార్జిషీట్: కేటీఆర్

హైదరాబాద్: ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఛార్జిషీట్ దాఖలు



చేశారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎవరికి అనుచిత లబ్ధి చేకూర్చామని ఆరోపిస్తున్నారో.. వారి పేరే లేదని చెప్పారు. ఈ కేసులో న్యాయపోరాటం చేస్తామని.. న్యాయస్థానాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. రూ.200 కోట్లతో నిర్వహించిన మిస్‌వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? అని ప్రశ్నించారు. ఎన్ని చేసినా ఆరు గ్యారంటీలు అమలు చేసేవరకు పోరాడతామన్నారు."ఈ కేసులో ఏమీ లేదని ఛార్జిషీట్‌లో ప్రభుత్వం మళ్లీ అంగీకరించింది. మేం కట్టింది రూ.45 కోట్లయితే.. రూ.500 కోట్లు, రూ.600 కోట్లు అని చెబుతున్నారు. విధానపరమైన లోపం ఉన్నట్లుందని ఛార్జిషీట్ ద్వారా తెలుస్తోంది. తప్పు జరిగితే.. బ్యాంకు ఖాతాలోని డబ్బును ఎందుకు రికవరీ చేయలేదు? ఈ కేసులో ఏమీ లేదని నేను మొదట్నుంచీ చెబుతున్న విషయాన్ని ప్రభుత్వం ధ్రువీకరించింది. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో హైదరాబాద్‌ను ప్రపంచపటంలో పెట్టేందుకు చేసిన ప్రయత్నమే ఫార్ములా ఈ-కార్ రేస్" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు: మంత్రి లక్ష్మణ్


హైదరాబాద్: విదేశీ విద్య ఉపకార వేతనాల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.607 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు.



అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ 2025 అక్టోబర్‌లో విదేశీ విద్య ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. విదేశాలకు వెళ్లిన విద్యార్థులు దీనికోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు కట్టలేక.. ఇక్కడికి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని అమలు చేయాలని కోరారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విదేశీ విద్య ఉపకార వేతనాలు ఎస్సీ వర్గాలకే మేలు చేస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను వంద శాతం అమలు చేయాలని.. దీంతో ఆయా వర్గాలకు న్యాయం జరగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని.. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయడం లేదన్నారు. మాల, మాదిగలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

# రణవీర్ సింగ్ విశ్వరూపం.. రికార్డులను తుడిచిపెడుతున్న 'ధురంధర్'

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత




రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్ 2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. సాక్‌నిల్క్ (Sacnilk) రిపోర్ట్ ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయ సినిమా చరిత్రలో టాప్ 5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..


## ఏపీలో ఫిల్మ్ సిటీ, షూటింగ్‌లపై కీలక చర్చలు



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు సంజయ్ దత్, తన బృందంతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశం జరిగింది. సంజయ్ దత్‌తో పాటు గౌరవ్ దూబే, కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వంటి ప్రముఖులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సంజయ్ దత్ కాసేపు ఏకాంతంగా కూడా మాట్లాడుకున్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ సిటీ నిర్మాణానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. విశాఖపట్నం లాంటి నగరాల్లో బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సింగిల్ విండో క్లియరెన్స్ విధానంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలను సంజయ్ దత్ బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. కేవలం నటుడిగానే కాకుండా, చిత్ర నిర్మాణ రంగంలో కూడా అనుభవం ఉన్న సంజయ్ దత్ బృందాన్ని ఏపీలో స్టూడియోలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించినట్లు సమాచారం.

ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

## ఏప్రిల్ నుంచి మెగా 158 షూటింగ్!



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నట్టు తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.

విశాఖలో నటి శ్రుతి హాసన్ సందడి..

## ఆమెను చూసేందుకు ఎగబడ్డ ఫ్యాన్స్



విశాఖపట్నంలో నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఇక, తమ అభిమాన నటి షోరూం ప్రారంభోత్సవానికి రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. షోరూం ప్రారంభోత్సవం అనంతరం శ్రుతి హాసన్ అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రుతి హాసన్‌తో పాటు ఎమ్మెల్యేలు సి.హెచ్. వంశీ కృష్ణ, వి. రామకృష్ణ బాబు కూడా పాల్గొన్నారు.

# సినిమా

## డార్లింగ్ రీ రిలీజ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సూపర్ హిట్ చిత్రం డార్లింగ్. ప్రస్తుతం ఈ చిత్రం మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు ఆయనకు డార్లింగ్ అనే ట్యాగ్ తెచ్చిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ఇప్పుడు రీరిలీజ్ రూపంలో తిరిగి థియేటర్లలో సందడి చేయబోతోంది. ఈ సినిమా ఏప్రిల్ 23న గ్రాండ్‌గా మళ్లీ విడుదల కానుంది. 2010లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ప్రభాస్ నటన, స్టైలిష్ లుక్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సినిమా తర్వాతే ఆయనకు డార్లింగ్ అనే పేరుతో అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది.

## గ్లామర్ టచ్

ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా వెలిగిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్.. షార్ట్‌టైంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్ లుక్స్ తోపాటు.. నటనతో ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అందం, అభినయంతో తెలుగు, తమిళ్, హిందీ అంటూ భాషతో సం బం ధం లేకుండా పాన్ ఇండియా హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని పెండ్లి చేసుకుని బాలీవుడ్ లోనే సెటిల్ అయిపోయింది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్‌మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా మరోసారి అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. జీబ్రా అవుట్ ఫిట్ లో మెస్మరైజ్‌చేసింది. వైట్ అండ్‌బ్లాక్‌చెక్స్‌డ్రెస్‌తో గ్లామర్ టచ్ ఇచ్చింది. రకుల్ షేర్‌చేసిన ఈ పిక్స్‌ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఇటీవలే హిందీలో 'దేదే ప్యార్‌దే 2'తో అలరించిన రకుల్.. లేటెస్టుగా 'మేరీ పత్నీ కా రీమేక్' ప్రాజెక్టులో బిజీగా ఉంది.



## సో స్పెషల్



'ది రాజా సాబ్' మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో గ్లామర్ షోతో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం సర్దార్ 2 షూటింగులో బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే మాళవిక మోహన్ తరచుగా గ్లామరస్ ఫొటోస్‌షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఓ ఈవెంట్‌లో ర్యాంప్‌వాక్‌తో అదరగొట్టింది. ఈసందర్భంగా మాళవిక ఇన్‌స్టా వేదికగా పిక్స్ లను ప్రేక్షకులతో పంచుకుంటూ ఇంట్రెస్టింగ్‌పోస్ట్‌చేసింది. 'నాకు ర్యాంప్‌వాక్ అంటే చాలా ఇష్టం. ఈ అద్భుతమైన లుక్‌ను రూపొందించిన నా టీమ్‌కు థాంక్స్. నటులుగా మనం క్యారెక్టర్‌లోకి ఒదిగిపోవడం, వేరేలా రెడీ కావడం అలవాటు. కానీ డైరెక్టుగా ఆడియన్స్ ముందుకు వెళ్లే ఆ అనుభూతి మాత్రం సో స్పెషల్. ముఖ్యంగా ఎంతో సరదాగా ఉంటుంది' అంటూ పేర్కొంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252, Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy